క్లుప్తంగా

గ్రంథాలయశాస్త్ర పితామహుడు రంగనాథన్



పాతపట్నం: రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విశ్రాంత ఎంపీడీఓ

పాతపట్నం: గ్రంథాలయశాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విశ్రాంత ఎంపీడీఓ సలాన చిరంజీవి, శాఖాగ్రంథాలయాధికారి కళ్ల రాజు నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. యామిని, వెంకట్, వెంకటరావ్, సింహాచలం, గంగయ్య, ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ప్రశాంతత నెలకొల్పాలి



శాంతియుత ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

నరసన్నపేట: మణిపూర్‌లో శాంతి నెలకొనడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని నరసన్నపేట నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జాన్ డేవిడ్, సాంబమూర్తి విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో మే 3వ తేదీ నుంచి జరుగుతున్న అల్లర్లకు నిరసిస్తూ నరసన్నపేటలో శనివారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సత్యవరం కూడలి నుంచి పల్లిపేట కూడలి వరకు ర్యాలీ చేపట్టారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ



పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సూర్యనారాయణ

కొత్తూరు: మండలంలోని ఓంద్రుజోలలో భూముల రీసర్వే పూర్తికావడంతో ప్రభుత్వం అందజేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను భూయజమానులకు కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ శనివారం పంపిణీ చేశారు. భూముల రీ సర్వే దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రీ సర్వే వల్లే నిజమైన భూ యజమానికి న్యాయం జరగడంతోపాటు రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రతీ పథకం వర్తిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, రెవెన్యూ, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాతపట్నం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 వద్ద గల బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి 8 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పెద్దలోగిడి గ్రామానికి చెందిన లోలుగు లక్ష్మణరావు రాత్రి ఏడు గంటల సమయంలో బైక్‌పై పర్లాకిమిడి వైపు వెళ్తున్నాడు. పాతపట్నం బస్టాండ్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో బైక్ పైనుంచి లక్ష్మణరావు పడిపోయాడు. లక్ష్మణరావు కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పాతపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు.

పాడి పశువుల పెంపకంపై అవగాహన



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ నారాయణరావు

ఎల్.ఎన్.పేట: పాడి పశువుల పెంపకం పట్ల పాడి రైతులకు అవగాహన పెంచాలని కొత్తూరు డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏడీ డి.నారాయణరావు అన్నారు. మండలంలోని మిరియాపల్లి రైతు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న పశుసంవర్ధక శాఖ విభాగాన్ని శనివారం పరిశీలించారు. వర్షాకాలంలో పాడి పశువుల్లో వచ్చే వ్యాధులు గుర్తించటం, వాటి నివారణ కోసం రైతులకు అవగాహన కల్పించాలన్నారు. లేగదూడల పెంపకం, ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న పశుగ్రాసం, పశుదాణా వంటి వాటికోసం వివరించాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులు సీపాన ప్రసాదరావు ఉన్నారు.

సమస్యలు వింటూ..
పరిష్కారం చూపుతూ..

- ప్రజాప్రయోజనాల కోసమే గడపగడపకు మన ప్రభుత్వం
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పొందూరు: కింతలిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ప్రజా ప్రయోజనాలకు, సమస్యల పరిష్కారానికి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రెడ్డిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికీ ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాలువలు, రోడ్లు వేయాలని స్పీకర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లన సూర్యారావు, సర్పంచ్ కంబాపు నీలవేణి, కంబాపు సూర్యారావు, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, వండాన సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పాతపట్నం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని చిన్నమల్లిపురం, కొయ్యకొండ, చీడిపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందించిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు తెలియజేయాలన్నారు. డ్రైనేజీని నిర్మించాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, వైస్ ఎంపీపీ ప్రదీప్, పార్టీ నాయకులు గాంధీ, వై.సూర్యం, కర్రి లక్ష్మీనారాయణ, పడాల రంజీత్, పోతుల శ్రీనివాసరావు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పాతపట్నం: చిన్నమల్లిపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నేల తల్లికి నమస్కారం..
వీరులకు వందనం



ఆమదాలవలస: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



హిరమండలం: హిరమండలంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: గురుకుల పాఠశాల వద్ద మొక్కను నాటుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాన్ని మరువలేమని పలు ప్రజాప్రతినిధులు అన్నారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులకు వందనాన్ని సమర్పించారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర ఆవశ్యకతను వివరించారు. మొక్కలను నాటారు. మట్టిని సేకరించి ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్య్ర సమరయోధుల వారసులు, మాజీ సైనికులను సన్మానించి గౌరవించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: కొర్లకోటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ వాసుదేవరావు, నాయకులు



కొత్తూరు: కర్లెమ్మ కాలనీలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, నాయకులు



నరసన్నపేట: కోమర్తిలో స్వాతంత్య్ర సమరయోధుడు కొయ్యాన సూర్యనారాయణ భార్య చిన్నమ్ముడును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



మెళియాపుట్టి: పట్టుపురంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: సింధువాడలో జాతీయ జెండా ఆవిష్కరించిన డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రభుత్వ స్థలంలో ట్రెంచ్ ఏర్పాటు



ప్రభుత్వ స్థలంలో ట్రెంచ్ తీయిస్తున్న వీఆర్వో, సర్వేయర్

నరసన్నపేట: మండలంలోని కరగాం–కంబకాయ రోడ్డులో గల ఓ రియల్ ఎస్టేట్‌లో నారాయణవలస రెవెన్యూ పరిధిలోని 65వ సర్వే నంబర్లో ఉన్న ప్రభుత్వ స్థలానికి రెవెన్యూ సిబ్బంది ట్రెంచ్ తీయించారు. ప్రభుత్వ స్థలాన్ని కలిపి ప్లాట్లు వేసి ఓ రియల్టర్ అమ్మకాలకు ప్రయత్నాలు చేస్తుండగా రెవెన్యూ సిబ్బంది గతంలో గుర్తించారు. సర్వే చేసి ప్రభుత్వ స్థలమని బోర్డులు పెట్టారు. రియల్టర్ ఆ బోర్డును తీయించేశాడు. దీనిని ఆలస్యంగా గుర్తించిన రెవెన్యూ సిబ్బంది తాజాగా అదే స్థలంలో ట్రెంచ్ తీసి హద్దులు వేశారు. ఎర్ర జెండాలు పాతారు. ఈ స్థలంలోకి మళ్లీ సదరు వ్యక్తి వెళ్తే క్రిమినల్ కేసు నమోదు చేయాలని వీఆర్వో గవరయ్య, సర్వేయర్ రామచంద్రరావుకు తహసీల్దార్ సింహాచలం ఆదేశించారు. విలువైన స్థలం కావడంతో ఎలాగైనా కాజేయడానికి రియల్టర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ సర్వే నంబర్లో 10 సెంట్లు ప్రభుత్వ స్థలం గుర్తించామని సర్వేయర్ రామచంద్రరావు తెలిపారు.

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న గీతా మండలి సభ్యులు

నరసన్నపేట: అధిక శ్రావణం(పురుషోత్తం మాసం) పురస్కరించుకుని శాలిహోండంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం చేశామని నరసన్నపేట గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. గీతా మండలి సభ్యులు 29 మంది అధిక శ్రావణ రోజుల్లో వివిధ పుణ్య క్షేత్రాలకు వెళ్లి భగవద్గీత పారాయణం చేస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా శనివారం వేణుగోపాలస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం చేశామన్నారు. వచ్చే వారం బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం చేస్తామన్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు.

ప్రయాణికుల అవస్థలు



కణుగులవలస అండర్ టన్నెల్ వద్ద నిల్వ ఉన్న వర్షంనీరు

ఆమదాలవలస రూరల్: మండలంలో కణుగులవలస రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన అండర్ టన్నెల్ వల్ల ప్రయాణికులకు, వాహనదారులకు అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో టన్నెల్‌లో నీరు నిల్వ అయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లక్షలాది రూపాయాలు ఖర్చు చేసి నిర్మించిన అండర్ టన్నెల్ వల్ల వాహనదారులు అడుగు నీటిలో ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అండర్ టన్నెల్ నిర్మాణ పనులు పూర్తికాకుండానే.. రైల్వే గేటును మూసి వేసి రాకపోకలు సాగించేందుకు దారి కల్పించారు. వర్షం పడితే టన్నెల్ మొత్తం నీటితో నిండిపోవడం వల్ల ప్రయాణాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గాన 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సరుబుజ్జిలి: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ఎల్ మోటివేటర్ సీహెచ్ వెంకటేష్ అన్నారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై పురుషోత్తపురం గ్రామంలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు.

రామచంద్రాపురంలో వైఎస్సార్ పొలంబడి

మెళియాపుట్టి: ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారి దానకర్ణుడు అన్నారు. రామచంద్రాపురంలో వైఎస్సార్ పొలంబడిని శనివారం నిర్వహించారు. 14 వారాలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు అందిస్తున్నారు. అధిక దిగుబడులు ఎలా సాధ్యం, రైతుల సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. వీఏఏ నరేంద్ర, సర్పంచ్ గూడ వసంతకుమారి ఉన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి సెంటుకి సాగునీరు అందిస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రెడ్డిపేట గ్రామంలో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జల్ జీవన్ మిషన్ ప్రోగ్రాం మిషన్ నిధులు రూ.40 లక్షలతో తాగునీటి కుళాయిలు నిర్మాణం ప్రారంభించారు. జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లన సూర్యారావు, సర్పంచ్ కంబాపు నీలవేణి, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, కంబాపు సూర్యారావు, వండాన సూరపునాయుడు, గార వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ట్రస్టు సేవలు అభినందనీయం



రక్తదానం చేస్తున్న దాతలు

కొత్తూరు: మండలానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జగన్మోహనరావు అన్నారు. కొత్తూరులో ట్రస్టు ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 106 మంది రక్తదానం చేశారు. జగన్మోహన్‌రావుతోపాటు పలువురు మాట్లాడుతూ ట్రస్టుకు దాతలు అందజేసిన విరాళాల ద్వారా పేదలకు వైద్య ఖర్చులకు సాయం, నిత్యావసర సరుకుల పంపిణీ, అనాథులకు నెలవారీ పింఛన్లు అందజేయడం వంటి సేవా కార్యక్రమాలను అభినందించారు. ట్రస్టు సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ రెడ్ క్రాస్ ద్వారా ఫ్రీజర్ బాక్స్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. ట్రస్టు చైర్మన్ అగతమూడి జగదీష్ మాట్లాడుతూ.. కొత్తూరు మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన వైద్యాధికారి అగతమూడి అప్పలనాయుడు ప్రతి నెలా ట్రస్టుకు రూ.పది వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు ఏర్పడి ఈ రెండేళ్లలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా మేనేజర్ చైతన్యగోగుల బుజ్జిబాబు, ప్రతినిధి చిన్మయరావు, వైద్యాధికారి అగతమూడి అప్పలనాయుడు, విశ్రాంత హెచ్ఎం ఎద్దు గోపాలదాస్ నాయుడు, పెద్దిన కులశేఖరం అల్వార్, పి.శ్రీధర్ పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే వేగవంతం చేయాలి



పాతపట్నం: అచ్చుతాపురం కాలనీలో ఇంటింటా సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

పాతపట్నం: ఓటర్ల జాబితా ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ రావాడ వెంకట్రామన్ అన్నారు. మండల కేంద్రంలోని అచ్చుతాపురం, కాగువాడ గ్రామాల్లో బీఎల్ఓలు చేస్తున్న ఇంటింటా సర్వేను శనివారం పరిశీలించారు. ఓటు హక్కును ఇష్టమైనచోట నమోదు చేయించుకునే హక్కు ఉంటుందన్నారు. తొలగింపులు, చేర్పులను ఓటర్ల అనుమతితోనే జరగాలన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, సీఎస్‌డీటీ భీమారావు, ఏఎస్ఓ బాలరాజు, ఆర్ఐలు, నాయకులు పాల్గొన్నారు.

హిరమండలం: ఓటరు సర్వేను వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ, ఆర్వో ఆర్.వెంకట్రామన్ అన్నారు. మండలంలోని 273, 274 పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వేను తనిఖీ చేశారు. ఈ నెల 18లోగా ఓటరు సర్వేను పూర్తిచేయాలన్నారు. అలాగే చొర్లంగిలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

మెళియాపుట్టి: ఈ నెల 21వ తేదీ నాటికి ఓటరు సర్వేను శతశాతం పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ అన్నారు. మండలంలోని జంతూరు, బంజీరు గిరిజన గ్రామాలలో జరుగుతున్న ఓటరు సర్వేను శనివారం పరిశీలించారు. పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. తహసీల్దార్ సరోజిని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా బీఎల్ఓలు ఇంటింటా పరిశీలనను వేగవంతం చేశారు. యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. నరసన్నపేట మారుతీనగర్‌లో 137, 138 పోలింగ్ బూత్‌ల్లో నూతన ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

జలుమూరు: బీఎల్వోలు ప్రతి ఇంటా సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. రాణలో ఇంటింటా సర్వేను పరిశీలించి సిబ్బంది సూచనలు చేశారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారిని గుర్తించి, ఎక్కడ ఓటు హక్కు వినియోగించుకుంటారో వారి అనుమతి ప్రకారం ఉంచాలన్నారు.

ఎల్.ఎన్.పేట: ఓటర్ల జాబితా విచారణ ప్రక్రియ వేగవంతం చేయాలని బీఎల్ఓలకు తహసీల్దార్ ఆర్.అప్పలరాజు ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా విచారణపై శనివారం పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్ఓలతో సమీక్షించారు. ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున బీఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్ల విచారణ వేగవంతం చేయాలన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి ఓటు హక్కు పొందేందుకు అర్హత ఉన్నవారిని గుర్తించి వారి వద్ద నుంచి ఓటు హక్కు నమోదు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన, బోగస్ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



విద్యుత్ స్తంభాలు తొలగిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: విద్యుత్ స్తంభాలు తొలగించండి శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని దీనబంధుపురం పంచాయతీ పరిధి కుద్దబ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మైదానంలో మూడు నెలల కిందట డంప్ చేసిన విద్యుత్ స్తంభాలను మండల విద్యుత్‌శాఖ ఏఈ టి.వి.రమణమూర్తి శనివారం తొలగించారు. స్వాతంత్య్ర వేడుకల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా.. నిర్వహించుకుంటామని ఉపాధ్యాయులు తెలిపారు.

వైభవంగా ముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతి పరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు.

జలుమూరు: అధిక శ్రావణ మాసం శనివారం బహుళ ఏకాదశి సందర్భంగా శ్రీముఖలింగంలోని మధుకేశ్వరుడి తిరువీధిని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

అందుబాటులో ఎరువులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఎరువులు ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి పైడి లతశ్రీ శనివారం ప్రకటించారు. ఎరవులు కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో డీఏపీ, యూరియా ఎరువులు విక్రయించామన్నారు. కొన్ని రైతు భరోసా కేంద్రాల్లో రెండో విడత యూరియా ఎరువు విక్రయించి మరోసారి అవసరమయ్యే ఎరువును తీసుకునివచ్చినట్లు తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేకుండా సిద్ధం చేశామన్నారు.